## క్లుప్తంగా...

### ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సాయియాదవ్, జమీల్

**అత్తాపూర్:** అత్తాపూర్ డివిజన్ పరిధిలో నెల కొన్న ప్రజా సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్ వెల్లడించారు. డ్రైనేజీ సమస్యలపై జలమండలి జనరల్ మేనేజర్ జమీల్‌తో కలిసి శనివారం ఆయన హైదర్‌గూడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఆదివారం బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయని ఇందులో భాగంగా దేవాలయాల వద్ద అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా డ్రైనేజీ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తగా డ్రైనేజీలను శుభ్రం చేయించామన్నారు. హైదర్‌గూడ ఆలిపోచమ్మ దేవాలయం ఆవరణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో ఉంటూ దేవాలయ ప్రాంగణంలో పరిసరాలు శుభ్రం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు శెట్టిగారి నరేందర్ రావు, బాలాజీ, హరికృష్ణ పాల్గొన్నారు.

### నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరిస్తాం



సులేమాన్‌నగర్‌లో పర్యటిస్తున్న మిర్జా రహమత్‌బేగ్

**రాజేంద్రనగర్:** సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ శనివారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలపై స్థానికులు ఫిర్యాదు చేయగా ఆయా పనులకు సంబంధించిన నివేదికను తనకు అందిస్తే నిధులను మంజూరు చేయిస్తానన్నారు. ఆయన వెంట నవాజుద్దీన్, మహ్మద్ జహంగీర్ ఉన్నారు.

### బోనాలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పర్యవేక్షించిన కౌన్సిలర్లు

**మణికొండ:** ఆషాఢమాసం గ్రామ దేవతలకు నిర్వహించే బోనాలకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. గండిపేట మండల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, మంచిరేవుల, కోకాపేట, గండిపేట గ్రామాలలో ఆదివారం బోనాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గ్రామాలలోని అమ్మవారి దేవాలయాలను మామిడి, వేప కొమ్మలు, రంగురంగుల పూలు, వీది దీపాలతో అలంకరించారు. పలు గ్రామాలలో మధ్యాహ్నం నుంచే అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని దేవాలయాల వద్ద ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి, కోకాపేటలో కౌన్సిలర్లు జి.శివారెడ్డి, విజయ్‌బాబు, దుర్గేష్‌యాదవ్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

### ఆస్పత్రి ఆవరణలో బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

**రాజేంద్రనగర్:** రోగులకు సేవ చేస్తూ హడావిడిగా కనిపించే డాక్టర్లు, నర్సులు, ఆయాలు ఇతర సిబ్బంది శనివారం సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. రోగులతో కిటకిటలాడే ఆసుపత్రి కాస్తా బోనాల పండుగతో సందడిగా కనిపించింది. రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం బోనాల పండుగను నిర్వహించారు. ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది అంతా ఈ బోనాల ఉత్సవంలో పాల్గొన్నారు. మహిళలు బోనాలతో ఆసుపత్రి ఆవరణలో ఉన్న దేవాలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం బోనాల పండుగను ఘనంగా నిర్వహించిన సిబ్బంది అనంతరం తమ విధుల్లోనూ పాల్గొన్నారు.

### యువకుడి అదృశ్యం

**శంషాబాద్ రూరల్:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ వివరాల ప్రకారం.. పాల్మాకులకు చెందిన ఎం.రాజేందర్‌గౌడ్(25) ఈ నెల 13న స్కూటీపై బయటకు వెళ్లి ఎంతకీ రాకపోవడంతో శనివారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

- 12 మందికి ఎంపీపీతో సహా ఒకే ఎంపీటీసీ హాజరు
- వాయిదాకు కారణాలపై ఆసక్తికర చర్చలు

**శంషాబాద్ రూరల్:** మూడు నెలలకోసారి జరిగే మండల సర్వ సభ్య సమావేశం ప్రజాప్రతినిధుల గైర్హాజరుతో వాయిదా పడింది. 12 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఎంపీపీతో పాటు మరో ఎంపీటీసీ మాత్రమే హాజరుకావడంతో కోరం లేక సమావేశం జరగలేదు. ఎంపీపీ జయమ్మ ఆధ్వర్యంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ సమావేశానికి అరగంట ఆలస్యంగా ఎంపీపీ జయమ్మ, పాల్మాకుల ఎంపీటీసీ ఇందిరా, జడ్పీటీసీ తన్వీరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు, కొంత మంది సర్పంచులు హాజరయ్యారు. 12 గంటల వరకు ఎంపీపీ, ఒక ఎంపీటీసీ సభ్యురాలు మాత్రమే సమావేశంలో ఉన్నారు. మిగతా సభ్యులు రాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మీ ప్రకటించారు. ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరుకావల్సి ఉండగా.. కేటీఆర్‌ను కలిసి వస్తారని అధికారులకు సమాచారం వచ్చింది. తీరా కోరం సరిపోక సభను వాయిదా వేయాల్సి రావడంతో చర్చానీయంగా మారింది.



మండల సర్వసభ్య సమావేశం వేదికపై ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు



సమావేశానికి హాజరైన ఒకే ఎంపీటీసీ ఇందిరా

**కారణం అదేనా?**

సర్వ సభ్య సమావేశానికి ఎంపీటీసీలు డుమ్మా కొట్టడంపై తెర వెనుక ఏం జరుగుతుందోనని మండలంలో చర్చకు దారి తీసింది. మండల పరిషత్ నుంచి నిధులు ఇవ్వని కారణంగా సభ్యులు నిరసన తెలపడానికి సభకు రాలేదని కొందరు చెప్పుకుంటున్నారు. మరో వైపు ఎంపీపీపై అవిశ్వాసం పెట్టడానికి రాజకీయాలు నడుస్తున్నట్లు భావిస్తున్నారు.

**నేడు సమావేశం..**

మండల సర్వ సభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మీ తెలిపారు. శనివారం నాటి సమావేశం కోరం లేక వాయిదా పడగా.. ఈ సమావేశాన్ని నేడు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

## సేవా కార్యక్రమాలు సంతృప్తినిస్తాయి

**మణికొండ:** మనం చేసే సేవా కార్యక్రమాలు మనకు ఎంతో సంతృప్తినిస్తాయని, ఉన్న వారు లేని వారికి ఏదైనా చేయటం చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్ అన్నారు. వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పుప్పాలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ వారు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పేదలకు దుస్తులు, అందించటం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రాబోయే రోజుల్లోను నిర్వహించాలని సంస్థకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి శ్రీధర్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు జితేందర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

- మణికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆత్రేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలను పంపిణీ చేశారు. అంతకు ముందు తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు.



స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన నరేందర్‌ముదిరాజ్

**సన్మానం**

**మణికొండ:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడిగా ఎంపికై న మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్‌ను ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. శుక్రవారం పార్టీ అధిష్ఠానం ప్రకటించిన ప్రచార కమిటీలో ఆయనకు స్థానం దక్కటం ఎంతో సంతోషకరమని జితేందర్ అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులను పొందాలని పార్టీ నాయకులు, కౌన్సిలర్లు ఆకాంక్షించారు.

## రూ. 8 వేలకు ఐఫోన్ అన్నారు.. రూ.40 వేలు దోచుకున్నారు

**శంషాబాద్ రూరల్:** ఇన్‌స్టాగామ్‌లో ఐఫోన్ కొనుగోలు చేసేందుకు యత్నించిన ఓ యువకుడు రూ.40 వేలు పోగొట్టుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ వివరాల ప్రకారం.. పాల్మాకుల పంచాయతీలోని మేకల బండతండాకు చెందిన వద్యా నాగేష్ (20) ఈ నెల 11న ఇన్‌స్టాగామ్ చూస్తూ అందులో ఐఫోన్ సెల్లర్ అనే ప్రొఫైల్‌లో ఫోన్ కావాలని పోస్టు పెట్టగా కాసేపటి తర్వాత ఓ వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. రూ.8 వేలకు ఐఫోన్ ఉందని, క్యాష్ ఆన్ డెలివరీ సౌకర్యం ఉందని చెప్పాడు. 13న తేదీన ఫోన్ చేసి డెలివరీ కోడ్ కోసం రూ.20 వేలు పంపించాలని తర్వాత ఈ మొత్తాన్ని తిరిగి ఇస్తామని నమ్మించాడు. దీంతో ఫోన్‌పే ద్వారా రూ.2 వేల చొప్పున పదిసార్లు డబ్బులు పంపించాడు. మరుసటి రోజు 14న ఫోన్ చేసి కోడ్ పని చేయడం లేదని చెప్పాడు. కాసేపటి ఓ వ్యక్తి తాను డెలివరీ బాయ్‌నంటూ తన ఏజెంట్‌కు రూ.20 వేలు పంపించమనడంతో ఆ మొత్తాన్ని కూడా ఫోన్‌పేతో చెల్లించాడు. డెలివరి బాయ్ మరో కారణంతో రూ.11 వేలు పంపించాలని మళ్లీ ఫోన్ చేయగా మోసపోయినట్లు గ్రహించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**శంషాబాద్:** శంషాబాద్ కూరగాయల మార్కెట్ అర్జీదారుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేందర్, ఉపాధ్యక్షుడిగా రత్నం, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపకార్యదర్శిగా శివకుమార్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారులుగా సతీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బొబ్బిలి శ్రీనివాస్, సంజీవరావు,లోకేష్ ముదిరాజ్, సుభాష్‌రెడ్డి, మల్లేష్, నరేందర్, మేకల సిద్దులు, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వినియోగదారులు, విక్రయదారుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## ఆలయ వార్షికోత్సవానికి ఎంపీకి ఆహ్వానం



ఎంపీ రంజిత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ ప్రేమావతి పేట్‌లో బంగారు పోచమ్మ దేవాలయ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ శనివారం చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌లను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దేవాలయాన్ని అధునాతన పద్ధతిలో పునఃనిర్మించామన్నారు. మొదటి వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించామని భక్తులకు ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ రాజ్‌కుమార్, ఎడ్లకాడి సూర్యం, బర్ల సుమన గోల్కొండ ఉపేందర్, ఎడ్లకాడి చంద్రశేఖర్, కోరని అక్షయ్‌కుమార్, చిలుకూరి హర్షవర్ధన్, ముత్యాల హరీష్ పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**రాజేంద్రనగర్:** విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే విలువలతో కూడిన విద్య, విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరిరావు అన్నారు. శనివారం అత్తాపూర్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కల్చరల్ లీడర్, స్పోర్ట్స్ లీడర్, క్యాప్టెన్స్, వైస్ క్యాప్టెన్స్‌ల విభాగాలో విద్యార్థులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాధ్యతలను తెలిపి అర్హులైన విద్యార్థులకు నాయకత్వం బాధ్యతలు అప్పగించారు. నాయకత్వం మనం చెప్పుకుంటే వచ్చేది కాదని ఒప్పుకుంటే వచ్చేది అన్నారు. విద్యా సంవత్సరానికి హెడ్ బ్యాగా ఉల్లాస్‌రావు, హెడ్ గర్ల్‌గా శ్రీకృతి ఎన్నికయ్యారు. ఇందులో భాగంగా నామినేషన్లు, ప్రచారాలు, ఓటింగ్, ఇంటర్వ్యూల ద్వారా నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కోడూరి నారాయణమూర్తి, ఎస్‌వీఎస్ కిషోర్‌కుమార్, ప్రిన్సిపల్ అన్నపూర్ణ, వైస్ ప్రిన్సిపల్ అనురాధా, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి

## విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

**అత్తాపూర్:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల బాధ్యత ఎంతో ఉందని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సాయిప్రసాద్‌రావు తెలిపారు. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల చదువు, వారి ఆలోచనా విధానాలు తదితర వాటిపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుతో పాటు ఏం చేస్తున్నారు అనే దానిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. చెడు మార్గాలకు దూరండా ఉండేలా చూసుకోవాలని చదువుకునే వయస్సులోనే వారి జీవితాలకు బంగారు బాటలు వేయించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ చేపడుతున్న తొలి మెట్టు, ఇంటింటా చదువుల పంట, మన ఊరు మన బడి, బాలసర్వం తదితర పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజియాబేగం, సరళ, మీనాకుమారి, రోజారాణి, జకీరా, మాణయ్య, హేమలత, పద్మావతి, జ్యోతి, సురేష్, గోపి పాల్గొన్నారు.

## రాత్రి తప్పించుకున్నావ్.. ఎప్పటికైనా చంపేస్తా

దారిలో అడ్డగించి వ్యక్తిపై దాడికి యత్నం

**శంషాబాద్ రూరల్:** ఓ వ్యక్తిని దారిలో అడ్డగించి దాడికి యత్నించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు నడికూడ శంకరయ్య (67) తొండుపల్లిలో ఓ వెంచర్ పని చేస్తున్నాడు. ఈ నెల 14న రాత్రి సమయంలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరగా అతని అల్లుడు నవీన్, మరో ఇద్దరు కలిసి అడ్డగించారు. దాడి చేసేందుకు యత్నించడంతో బైక్‌ను వదిలేసి అటుగా వచ్చిన డీసీఎంలో ఎక్కి తప్పించుకుని వెళ్లాడు. శనివారం ఉదయం అతని అల్లుడు ఫోన్ చేసి.. రాత్రి తప్పించుకున్నావ్.. ఎప్పటికైనా చంపేస్తానంటూ బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## బీటీ రోడ్డు పనుల పరిశీలన

**శంషాబాద్:** పట్టణంలోని 11, 12 వార్డులకు అనుసంధానంగా వేస్తున్న బీటీ రోడ్డు పనులను శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ శనివారం పరిశీలించారు. పట్టణంలో రహదారుల అభివృద్ధికి దశలవారీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని వార్డుల్లో మౌలిక వసతులను కూడా ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లావణ్య, ప్రవీణ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పారెపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెంటయ్య, దర్శన్‌గౌడ్, సుధాకర్, రాము, రాజు,ప్రసాద్, కొండ శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

## వేదికను పంచుకునేలా అవకాశం కల్పించాలి

**శంషాబాద్ రూరల్:** మండల సర్వ సభ్య సమావేశంలో వేదికపై కూర్చోవడానికి తనను పిలవకపోవడం ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడం అవుతుందని మల్కారం సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ బూర్కుంట సతీష్ అన్నారు. శనివారం జరిగిన సభను కోరం లేక వాయిదా పడగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల ఓటుతో గెలుపొందిన మాకు.. రైతులు, ప్రజల సమస్యలపై వేదికను పంచుకోవడానికి సర్వ సభ్య సమావేశంలో అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలపై పేర్లు కూడా రాయాలన్నారు. సొసైటీ చైర్మన్లకు తగిన గౌరవం ఇచ్చి ప్రజా సమస్యల పరిష్కారం కోసం మాకు అవకాశం ఇవ్వాలన్నారు.

## పుస్తకాలు, ప్లేట్ల పంపిణీ

**బండ్లగూడ:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ నాయకుడు దుర్గచరణ్ వెల్లడించారు. శనివారం ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా హిమాయత్‌సాగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు.